సీమవార్త

రాయల సీమ

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

పేజీలు : 4

గురువారం 12 నవంబర్ 2026

డిస్టిక్ లెవెల్ లో.... దివ్యాంగులకు స్పోర్ట్స్...!!

.....జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ (దివ్యాంగుల) ఎంపికల నిర్వహణ.

పుట్టపర్తి,నవంబర్,11: సీమ వార్త.



ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో, శ్రీ సత్య సాయి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ (దివ్యాంగుల) క్రీడాకారుల ఎంపిక పోటీలు ధర్మవరం నిర్వహించబడుతున్నాయి.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం (డిసెంబర్ 3, 2026) సందర్భాన్ని పురస్కరించుకోని దివ్యాంగ క్రీడాకారులను ప్రోత్సహించడానికి మరియు వారికి మరిన్ని క్రీడా అవకాశాలు కల్పించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి. కిషోర్ తెలిపారు.

ఎంపికల వివరాలు:

15-11-2026 (ఆదివారం)

13 సంవత్సరాలు పైబడిన బాలురు మరియు బాలికలు మాత్రమే అర్హులు.

వేదికలు:పురుషుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ధర్మవరం,కళాజ్యోతి ఇండోర్ స్టేడియం, ధర్మవరం.

పోటీలు నిర్వహించే క్రీడాంశాలు:

పారా-అథ్లెటిక్స్

పారా-బ్యాడ్మింటన్

వీల్‌చైర్ ఫెన్సింగ్

బ్లైండ్ గోల్‌బాల్

పారా-తైక్వాండో

టేబుల్ టెన్నిస్

అర్హత మరియు ఆసక్తి కలిగిన దివ్యాంగ క్రీడాకారులు ఆదివారం ఉదయం 8 గంటలకు 15-11-2026 తేదీన పురుషుల ప్రభుత్వ పాఠశాల ధర్మవరం నందు ఈ ఎంపికల్లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరడమైనది.

మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్: 9848187636



ఆరోగ్యమే మహాభాగ్యం..!!

.....విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

కడప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యుగంధర్

పులివెందుల నవంబర్ 11 (సీమ వార్త):

విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని, దోమల బెడద నుంచి రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని కడప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. యుగంధర్ పేర్కొన్నారు. వేముల లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో విద్యార్థినులకు బుధవారం ఆయన చేతుల మీదుగా దోమతెరలను పంపిణీ చేశారు. ?ఈ సందర్భంగా డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ, దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థులకు దోమతెరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ రాత్రి వేళల్లో తప్పనిసరిగా దోమతెరలు వాడాలని సూచించారు. ఎడిస్, అనాఫిలిస్ దోమల కాటు వల్ల తీవ్రమైన జ్వరాలు వస్తాయి. డెంగ్యూ సోకితే రక్తంలో ప్లేట్‌లెట్స్ వేగంగా తగ్గి ప్రాణాపాయం ఏర్పడే ప్రమాదం ఉంది. చికున్‌గున్యా వల్ల నెలల తరబడి కీళ్ల నొప్పులు ఇబ్బంది పెడతాయన్నారు. నిద్రించేటప్పుడు తప్పనిసరిగా దోమతెరలు వాడాలని కాళ్లు, చేతులు పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలన్నారు. హాస్టల్, పాఠశాల పరిసరాల్లో నిల్వ నీటిలోనే దోమలు వృద్ధి చెందుతాయని కొద్దిపాటి జ్వరం, నీరసం లేదా ఒళ్లు నొప్పులు ఉన్నా వెంటనే ఉపాధ్యాయులకు లేదా వైద్యులకు తెలియ జేయాలన్నారు.. సొంత వైద్యం ఎట్టి పరిస్థితుల్లోనూ చేసుకోకూ డదన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత గురించి, చేతులు ఎలా శుభ్రత పరుచుకోవాలి గురించి విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మౌనుద్దీన్, జిల్లా సర్వలెన్స్ అధికారి డాక్టర్ వెంకట చంద్రారెడ్డి, జిల్లా సహాయక మలేరియా అధికారి వెంకటరెడ్డి, స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ శరణ్య రెడ్డి, జిల్లా ఎపిడమాలజిస్ట్ ఖాజా మౌనుద్దీన్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేష్, పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి, సూపర్వైజర్ రమేష్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.





కన్నడ గడ్డపై...



ఆధునిక వైద్యం.. ప్రజలకు ఎంతో శ్రేయస్కరం..!!

...బళ్లారిలో వెస్టా డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం

...ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా...

మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరు.

బొమ్మనహాల్, నవంబర్ 11 (సీమ వార్త):



బళ్లారి నగరంలోని ప్రముఖ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వెస్టా డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, సత్య సాయి జిల్లా ఎంపీ పార్థసారథి, తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి డయాగ్నోస్టిక్ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఆధునిక వైద్య సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అత్యాధునిక వైద్య పరికరాలతో సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కేంద్రంలో రక్త పరీక్షలు, స్కానింగ్, ఎక్స్‌రే, ఈసీజీతో పాటు అత్యాధునిక ల్యాబ్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు కాలవ భరత్, డాక్టర్ అక్బర్ తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య పరీక్షలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు, వైద్యులు, వ్యాపారవేత్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భయం వీడండి.....ఆత్మ విశ్వాసంతో

పరీక్షలు రాయండి..!!

....కేజీబీవీలో ఏపీసీ శైలజ ఆకస్మిక తనిఖీ

....విద్యార్థినులతో కలిసి అల్పాహారం.. రాత్రి పాఠశాలలోనే బస

....100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులకు దిశానిర్దేశం



పుట్టినా.. చనిపోయినా వెంటనే నమోదు చేయించుకోండి.. లేదంటే కష్టమే..

పుట్టినా.. చనిపోయినా వెంటనే నమోదు చేయించుకోండి.. లేదంటే కష్టమే..

రెండు సంవత్సరాలు దాటితే న్యాయమూర్తి ఉత్తర్వులు తప్పనిసరి..

తాడిపత్రిలో కొత్త నిబంధనలు అమలు

తాడిపత్రి, నవంబర్ 11 సీమ వార్త: జనన మరణాల నమోదు సవరణ చట్ట నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని తాడిపత్రి తహసీల్దారు రవిచంద్ర, డిప్యూటీ తహసీల్దారు మలేష్ ప్రసాద్ మరియు పురపాలక సంఘ కార్యనిర్వాహకులు ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జనన మరణాల నమోదు చట్ట సవరణ రెండు వేల ఇరవై మూడు మరియు నమోదు నిబంధనల సవరణ రెండు వేల ఇరవై నాలుగు ప్రకారం తాడిపత్రి మండలం మరియు పురపాలక సంఘం పరిధిలో జాప్యంగా నమోదు చేసుకునే వారు తప్పనిసరిగా కొత్త నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ మేరకు తాడిపత్రి తహసీల్దారు కార్యాలయంలో బుధవారం వైద్య, రెవెన్యూ, పురపాలక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి, జాప్యంగా నమోదు చేసుకునే వారికి సంబంధించిన నూతన విధానాలపై అవగాహన కల్పించారు. జాప్య నమోదుకు సంబంధించి పాటించాల్సిన నిబంధనలు ఇలా ఉన్నాయి. సంఘటన జరిగి ఒక సంవత్సరం దాటి, రెండు సంవత్సరాల లోపు అయితే సంబంధిత జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి అనుమతితో నమోదు చేయాలి. సంఘటన జరిగి రెండు సంవత్సరాలు దాటితే – ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఉత్తర్వుల ద్వారా మాత్రమే నమోదు చేయాలి. ప్రజలు తాడిపత్రి పురపాలక సంఘ కార్యాలయంలో లేదా తమ గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. కావాల్సిన ఆధారాలు: దరఖాస్తు చేసే సమయంలో ఆసుపత్రి నుండి ఇచ్చిన పత్రం, ఆధార్ నకలు, తల్లిదండ్రుల గుర్తింపు పత్రం తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ.. జనన మరణ నమోదులకు సంబంధించి పదమూడువ నిబంధన మూడవ ఉప నిబంధన ప్రకారం నిర్ణీత ఆధారాలు ఇచ్చిన తర్వాతే అధికారులు అనుమతి ఇస్తారని, తప్పుడు సమాచారం ఇచ్చి నమోదు చేయించుకునే ప్రయత్నం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాబట్టి ప్రజలు జననం లేదా మరణం జరిగిన వెంటనే ఇరవై ఒక్క రోజుల్లోపు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని, "గడువు దాటితే న్యాయస్థానం చుట్టూ తిరగాల్సి వస్తుంది, కాబట్టి వెంటనే నమోదు చేయించుకోండి" అని అధికారులు సూచించారు.

సాంకేతికత పెరిగినా సంప్రదాయానికి చెదరని ఆదరణ

- మట్టిలోని మహత్తును చాటుతున్న ప్రమిదలు

-కార్తీక దీపం ప్రత్యేకత



పులివెందుల నవంబర్ 11 (సీమ వార్త): కార్తీక మాసం అనగానే ముందుగా గుర్తుకొచ్చేది దీపాల వెలుగు.. ఆ వెలుగులో మట్టి ప్రమిదల ప్రత్యేకత. ఏడాది పొడవునా ఎలా ఉన్నా కార్తీక మాసం వచ్చిందంటే చాలు.. ప్రతి ఇంటా ఆధ్యాత్మిక సందడి మొదలవుతుంది. తెల్లవారుజామునే స్నానాలు ఆచరించి, ఇంటి ముందు ముగ్గులు వేసి, తులసి కోట వద్ద, ఇంటి గడప వద్ద దీపాలు వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయాల ఆవరణలు సైతం దీపకాంతులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటాయి. కాలం మారింది.. సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోంది. విద్యుత్ దీపాలు, ఎలక్ట్రానిక్ దీపాలు, వివిధ రకాల అలంకరణ సామగ్రి అందుబాటులోకి వచ్చాయి. అయినప్పటికీ కార్తీక మాసంలో మట్టి ప్రమిదలకు ఉన్న ఆదరణ మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే మట్టి ప్రమిదల్లో నూనె పోసి, వత్తులు వేసి వెలిగించే జ్యోతి భక్తులకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తోంది. మట్టి ప్రమిదలో వెలిగే చిన్న జ్యోతి వెనుక ఎంతో గొప్ప సందేశం దాగి ఉంది. భూమి నుంచి లభించే మట్టితో తయారైన ప్రమిద,: ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తుంది. ఆధునికత ఎంతగా పెరిగినా మన మూలాలను, సంప్రదాయాలను మరచిపోకూడదనే విషయాన్ని చాటిచెబుతోంది. విద్యుత్ కాంతులు ఎంత ప్రకాశవంతంగా ఉన్నా మట్టి ప్రమిదలో వెలిగే దీపానికి ఉండే ఆప్యాయత, పవిత్రత ప్రత్యేకమే. మరోవైపు కార్తీక మాసం సందర్భంగా మట్టి ప్రమిదలకు పెరుగుతున్న గిరాకీ కుమ్మరి కుటుంబాలకు ఉపాధిని కల్పిస్తోంది. తరతరాలుగా మట్టి పాత్రలు, ప్రమిదలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్న కళాకారులకు ఈ మాసం కొంత ఆర్థిక భరోసాను అందిస్తోంది. చేతితో మట్టిని మలిచి, అందమైన ప్రమిదలుగా తీర్చిదిద్ది మార్కెట్లకు తీసుకొస్తున్నారు. భక్తులు సైతం వాటిని ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. చీకటిని పారద్రోలే దీపం కేవలం వెలుగునే కాదు.. భక్తిని, సంప్రదాయాన్ని, ప్రకృతితో మానవ సంబంధాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. అందుకే కార్తీక మాసంలో మట్టి ప్రమిదకు ఉన్న ప్రాధాన్యత ఎప్పటికీ ప్రత్యేకమే. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా.. సంప్రదాయపు వెలుగును మాత్రం మట్టి ప్రమిదలే నిలబెడుతున్నాయి.

మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు శుభాకాంక్షలు.

అభినందనలు తెలియజేసిన మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య.



ధర్మవరం నవంబర్ 11 సీమ వార్త: ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో మున్సిపల్ చైర్మన్ గా టిడిపి పార్టీకి చెందిన పరిసే సుధాకర్, తదుపరి టిడిపి పార్టీకి చెందిన 28 మంది కౌన్సిలర్లకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటరమణయ్య అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మున్సిపల్ కార్యాలయ సమస్యలను వారు తెలియజేశారు. తదుపరి చైర్మన్ తో పాటు 28 మంది వార్డు కౌన్సిలర్లను కమిషనర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ , కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు.


ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి.



ధర్మవరం నవంబర్ 11 సీమ వార్త ; ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై. ప్రశాంతి ఆధ్వర్యంలో భారత రత్న శ్రీ మౌలానా అబుల్ కలం ఆజాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. నేటి సమాజంలో విద్యా యొక్క ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు .భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ యొక్క జీవిత విశేషాలను అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. జస్వంత్ కుమార్ సమక్షంలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌తో ఫయాజ్ బాషా మర్యాదపూర్వక భేటీ..

కీలక చర్చ!



తాడేపల్లి, నవంబర్ 11 వార్త: తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి హీరాపురం ఫయాజ్ బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాడిపత్రి నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, రాబోయే కార్యాచరణపై కీలక చర్చ జరిగినట్లు సమాచారం. తాడిపత్రిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఫయాజ్ బాషా జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఫయాజ్ బాషా మాట్లాడుతూ.. "జగన్ ఆశీస్సులతో తాడిపత్రిలో పార్టీని మరింత బలోపేతం చేస్తాం. తాడిపత్రిలో వైసీపీని తిరిగి గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తాం" అని అన్నారు. ఫయాజ్ బాషా ని ఆప్యాయంగా పలకరించిన జగన్మోహన్ రెడ్డి, పార్టీ కోసం మరింత కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ భేటీ తాడిపత్రి వైఎస్సార్సీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

గ్రామపంచాయతీల ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో ఆర్వోలు ఏఆర్వోలది కీలకపాత్ర.

డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ జల్లా శ్రీనివాసులు.



ధర్మవరం నవంబర్ 11 సీమ వార్త: గ్రామపంచాయతీలలో ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో ఆర్వోలు, ఏ ఆర్ ఓ లది కీలక పాత్ర అని డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ జల్లా శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు డివిజనల్ డెవలప్మెంట్ కార్యాలయం నందు నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల యొక్క ఒకరోజు శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి డివిజనల్ డెవలప్మెంట్ అధికారి జల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం నుంచి పోలింగ్ కార్యక్రమం నిర్వహించడంతోపాటు ఫలితాలు ప్రకటించడంలో ఆర్వో లు సహాయ ఆర్వోలు బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఇందుకు సంబంధించి విషయ పరిజ్ఞానాన్ని అందరూ పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వీటితోపాటు గ్రామ సీమలకు పట్టుకొమ్మలాంటి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతి నిధులు కీలక పాత్ర పోషిస్తారని అలాంటి ఎన్నికలు నిర్వహించేటప్పుడు మనం అత్యంత పకడ్బందీగా వ్యవహరించి, పారదర్శకంగా, జవాబుదారితనంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం డివిజన్ పరిధిలోని అందరూ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మాస్టర్ శిక్షకులు, ఆర్వోలు , ఏఆర్వోలు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి జూడో ఛాంపియన్‌షిప్‌కు 15 మంది విద్యార్థుల ఎంపిక.



ధర్మవరం నవంబర్ 11 సీమ వార్త ; ధర్మవరం పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్ సమీపంలో ఉన్న జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సబ్ జూనియర్ జూడో జిల్లా స్థాయి ఎంపిక పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై. సుగుణ, ఫిజికల్ డైరెక్టర్ స్వరూప హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా జూడో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్. షేక్షావలి, ధర్మవరం జూడో కోచ్ ఇనాయత్ భాష, రెడ్డుపరెడ్డి కేలో ఇండియా కోచ్, చంద్రకళ పాల్గొని పోటీ వివరాలను తెలియజేశారు.
ఈ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని వివిధ బరువు విభాగాల్లో తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు.రాష్ట్రస్థాయి జూడో ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు వివరాలను తెలుపుతూ బాలికల విభాగంలో నవ్య శ్రీ,,సంధ్య ,వైష్ణవి,తన్విక,సింధు,చైత్ర ప్రణవి,డామేరెసువరీ తదుపరి బాలుర విభాగంలో వీక్షిత్, మోహిధర్, నితీష్,సిద్ధార్థ,నందవర్ధన్,కోటేశ్వరరావు, మునీంద్ర ఉన్నారన్నారు. వీరు జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన మొత్తం 15 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి జూడో ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు అని తెలిపారు.ఈ రాష్ట్రస్థాయి పోటీలు నవంబర్ 13, 14, 15 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్నారు అని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి సత్యసాయి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, జూడో వంటి మార్షల్ ఆర్ట్స్ ద్వారా ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం పెంపొందించుకోవాలని తెలిపారు. జిల్లా స్థాయి సెలక్షన్స్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను, ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

యాడికి పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం

యాడికి నవంబర్ 11 (సీమ వార్త) యాడికి మండలం వేములపాడు గ్రామంలో సీఐ ఆర్. శ్రీనివాసులు తన పోలీసు సిబ్బందితో కలిసి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేములపాడు, తిమ్మాపురం గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు, అశాంతికి దారితీసే కార్యక్రమాలు జరగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు తలెత్తినా, అనుమానాస్పద సంఘటనలు చోటుచేసుకున్నా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు తెలిపారు. ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు భద్రత కల్పించడం, గ్రామాల్లో శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ పల్లెనిద్ర కార్యక్రమంలో పోలీసు సిబ్బంది చురుగ్గా పాల్గొని గ్రామస్తులకు భద్రతపై అవగాహన కల్పించారు. గ్రామస్తులు కూడా పోలీసులకు సహకరిస్తూ కార్యక్రమంలో పాల్గొన్నా



అవకాశం ఇస్తే గ్రామాభివృద్ధికి విరాళం

టి సుండుపల్లె, నవంబర్ 11సీమ వార్త మండల పరిధిలోని రాయవరం గ్రామానికి చెందిన జనసేన సీనియర్ నాయకులు మచ్చా లక్ష్మీనారాయణ కీలక ప్రకటన చేశారు.తన సతీమణి శ్రీమతి తుమ్మల వెంకటలక్ష్మి ని సర్పంచ్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎంపిక చేస్తే, గ్రామాభివృద్ధి కోసం రూ.70 లక్షలు విరాళంగా అందిస్తానని ప్రకటించారు.గతంలో నాలుగు పర్యాయాలు, సుమారు 20 సంవత్సరాలుగా సర్పంచ్ పదవికి పోటీ చేసిన ఆయన,గెలుపోటములతో సంబంధం లేకుండా గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. ఏపీఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా గ్రామానికి సేవ చేయాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు.తన పెద్ద కుమారుడు దుబాయ్‌లోని బిట్స్ పిలానీలో బీటెక్ పూర్తి చేయగా, రెండో కుమారుడు అన్నపూర్ణ స్టూడియోలో నటనలో శిక్షణ పొందుతున్నారని వివరించారు.తన సతీమణికి సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే రూ.70 లక్షలతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని మచ్చా లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు.

నేత్రదానం చేసిన కీర్తిశేషులు ఆరువేటి గంగయ్య.

ధర్మవరం నవంబర్ 11 సీమ వార్త: ధర్మవరం పట్టణంలోని ఎల్వీ సర్కిల్లో



నివాసమున్న ఆర్వేటి సాయి లీలమ్మ భర్త స్వర్గస్తులైన ఆర్వేటి గంగయ్య నేత్రదానం చేయడం జరిగిందని రోటరీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆ కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యుల అంగీకార మేరకు అనంతపూర్ రెడ్ క్రాస్ సొసైటీ ఐ రిట్రీవల్సెంటర్ నుండి విచ్చేసిన టెక్నీషియన్ రాఘవ సహాయంతో స్వర్గస్తులైన ఆర్వేటి గంగయ్య నేత్రాలను స్వీకరించారు. తదుపరి కుటుంబ సభ్యులైన ఆర్వేటి కిషోర్, ఆరువేటి శ్రీధర్ లకు రోటరీ క్లబ్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శివయ్య, సుదర్శన్ గుప్తా బి.వి చలం, ప్రముఖ ఆప్తాలమిస్ట్, డాక్టర్ సంకారపు నరసింహులు , శ్రీనివాస్ రెడ్డి , నరేంద్ర రెడ్డి పాల్గొన్నారు

ప్రతి విద్యార్థి నేత్రదానంపై అవగాహన పెంపొందించుకోవాలి.

రిటైర్డ్ జిల్లా అందత్వ నివారణ అధికారి.

కంటి వైద్య నిపుణులు డాక్టర్ సంకారపు నరసింహులు.



ధర్మవరం నవంబర్ 11 సీమ వార్త; ప్రతి విద్యార్థి నేత్రదానంపై అవగాహన పెంపొందించుకోవాలని రిటైర్డ్ జిల్లా అందత్వ నివారణ అధికారి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సంకారపు నర్సింలు తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని సాయి కృప జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నేత్రదానంపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. అంతేకాకుండా కళాశాల పక్కన జరుగుతున్న నేత్రదానం తీసే దృశ్యాన్ని కూడా విద్యార్థులకు వివరించారు. అంతేకాకుండా కళాశాలలో దృశ్య శ్రవణ పద్ధతిలో కూడా, స్లైడ్స్ ద్వారా నేత్రదానమును స్వీకరించే విధానాన్ని, కంటిపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను కూడా వివరించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులందరూ కూడా తమ కుటుంబంలో కానీ ప్రాంతంలో గాని వ్యక్తులు మరణించినప్పుడు కుటుంబ సభ్యులను సంప్రదించి నేత్రదానమునకు ఒప్పించవలసిందిగా వారు తెలియజేశారు. అంతేకాకుండా స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా నేత్రదానం ఇచ్చే వారికి కూడా తెలపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భగవంతు రెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించిన సీఐ.. జనార్ధన్




చిలమత్తూరు నవంబర్ 11 సీమ వార్త జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, డీఎస్పీ రవిబాబు పర్యవేక్షణలో రానున్న గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి సిఐ జనార్ధన్ సిబ్బందికి సూచించారు. త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చిలమత్తూరు పోలీస్ స్టేషన్‌లో హెచ్‌డీపీ రూరల్ సర్కిల్ సీఐ గారు బుధవారం పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు జారీ చేసిన ఆదేశాలు, సూచనలను సిబ్బందికి వివరించారు. ఎన్నికల సన్నద్ధత, భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ, ముందస్తు నివారణ చర్యలు తదితర అంశాలపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ, తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిరంతరం అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు.

ఆన్‌లైన్ చెల్లింపుల దిశగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అడుగులు



ప్రొద్దుటూరు, నవంబర్ 11, (సీమ వార్త) : మున్సిపల్ కార్యాలయంలో ప్రజలకు అందించే సేవలను మరింత సులభతరం చేసేందుకు చెల్లింపుల వ్యవస్థలో డిజిటల్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కౌంటర్ల వద్ద పన్నులు, ఇతర రుసుముల వసూళ్లను నగదు రహిత విధానంలో నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రస్తుతం నగదు రూపంలో జరుగుతున్న లావాదేవీలను క్రమంగా తగ్గించి, యూపీఐ, క్యూఆర్ కోడ్ వంటి ఆధునిక చెల్లింపు విధానాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. డిజిటల్ చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ఆన్‌లైన్ ద్వారా రుసుములు చెల్లించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వారికి సహాయం అందించేందుకు ప్రతి కౌంటర్ వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. డిజిటల్ చెల్లింపుల విధానం అందరికీ సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలని, అన్ని కౌంటర్లలో సాంకేతిక సదుపాయాలు నిరంతరం పనిచేసేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నగదు రహిత లావాదేవీలతో సమయం ఆదా కావడమే కాకుండా, చెల్లింపుల్లో పారదర్శకత పెరిగి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. మున్సిపల్ వ్యవహారాల్లో డిజిటల్ విధానాన్ని పటిష్టంగా అమలు చేసి, ప్రజలకు ఇబ్బందులు లేని సేవలు అందించడమే లక్ష్యమని కమిషనర్ తెలిపారు. నగదు రహిత చెల్లింపులకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేలా ప్రతిభా పురస్కారాలు



ప్రొద్దుటూరు, నవంబర్ 11, (సీమ వార్త) : విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించి, వారి ప్రతిభను ప్రోత్సహించాలనే లక్ష్యంతో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా బుధవారం అంజుమాన్ ఏ అహలే ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్‌లో ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. 2025--26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన సుమారు 34 మంది ముస్లిం విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. కమిటీ అధ్యక్షుడు ముక్తియార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ ప్రతిపాదిత చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి హాజరై విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉన్నత విద్య, భవిష్యత్తు అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఒత్తిడిని జయించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి



మైదుకూరు, నవంబర్ 11, (సీమ వార్త) : విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ సుప్రియ సూచించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం లెక్కలవారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుప్రియ మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండటం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా విద్యార్థుల అభ్యున్నతికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే. నరసింహులు, గణిత ఉపాధ్యాయురాలు చంద్రకళ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గజ్జల వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పాలాల్లో పేకాట శిబిరం.. పోలీసుల దాడిలో ఐదుగురు పట్టివేత

మైదుకూరు, నవంబర్ 11, (సీమ వార్త) : గ్రామీణ ప్రాంతాల్లో జూదం నిర్వహిస్తున్న వారిపై మైదుకూరు అర్బన్ పోలీసులు నిఘా పెట్టి దాడులు చేపట్టారు. ఇందులో భాగంగా శివపురం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో జూదం ఆడుతున్న ఐదుగురిని పోలీసులు పట్టుకున్నారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన ఐదుగురిలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చాపల షరీఫ్ కూడా ఉన్నారు. జూదం ఆడుతున్న వారి నుంచి రూ.8,100 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై మైదుకూరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తెలిపారు.

గ్రామ అభివృద్ధే ధ్యేయం... సిద్ధ రామాదేవి సర్పంచ్ బరిలోకి.....



నంబుల పూలకుంట:నవంబర్ 11 (సీమవార్త):మరికొమ్మదిన్నె గ్రామ అభివృద్ధి కోసం యువ నాయకుల అండతో సిద్ధ రామాదేవి సర్పంచ్ ఎన్నికల బరిలోకి సిద్ధమవుతున్నారు. సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే కొత్తగా ఏర్పాటు అవుతున్న సోలార్ కంపెనీ సహకారంతో రైతులు భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం అందేలాగా కృషి చేస్తానని సోలార్ ఉపాధి గ్రామంలో ఉన్న యువతకే అందేలాగా కృషి చేస్తానని సీఎస్ఆర్ నిధులు తీసుకొచ్చి గ్రామ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాననే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. పదవిని ఆశించడం కాదు... గ్రామ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తన లక్ష్యమని, యువతను భాగస్వాములుగా చేసుకుని మరికొమ్మదిన్నెను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాననే ఆశయంతో ఉన్నారు. యువతకు ఉపాధి... ప్రతి ఇంటికి అభివృద్ధి... మరికొమ్మదిన్నెకు కొత్త దిశ!

అమరాపు మండల సర్పంచులు, వార్డ్ మెంబర్ల రిజర్వేషన్లు ఇవే

అమరాపురం నవంబర్ 12 సీమవార్త అమరాపురం మండలంలోని 11 గ్రామపంచాయతీలకు ఈనెల 13న గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఎన్నికల కమిషన్ విడుదల చేస్తుండడం విధితమే.మూడో విడత జరిగే ఎన్నికల్లో సర్పంచుల, వార్డ్ మెంబర్ల రిజర్వేషన్లను అధికారులు ప్రకటించారు. ఆలదపల్లి సర్పంచ్ స్థానానికి జనరల్ (మహిళ), 10 వార్డులకు బీసీ మహిళ, జనరల్, జనరల్ మహిళ, బిసి, బిసి, జనరల్, జనరల్ మహిళ, ఎస్సీ, జనరల్ మహిళ, ఎస్సీ మహిళ, అమరాపురం పంచాయతీ సర్పంచ్ జనరల్ (మహిళ), 14 వార్డులకు జనరల్, జనరల్ మహిళ, బీసీ, బీసీ, ఎస్సీ, బీసీ, జనరల్ మహిళ, జనరల్, జనరల్ మహిళ, జనరల్, బీసీ మహిళ, ఎస్సీ మహిళ, జనరల్ మహిళ, బీసీ మహిళ, బసవనపల్లి పంచాయతీ సర్పంచ్ స్థానానికి జనరల్, 12 వార్డులకు గాను ఎస్సీ, జనరల్ మహిళ, ఎస్సీ మహిళ, జనరల్, జనరల్ మహిళ, ఎస్టి, ఎస్సీ మహిళ, జనరల్ మహిళ, ఎస్సీ, బీసీ మహిళ, జనరల్ మహిళ, జనరల్, హాలుకూరు గ్రామపంచాయతీ సర్పంచ్ కు జనరల్ మహిళ, 14 వార్డులకు గాను జనరల్ మహిళ, ఎస్సీ మహిళ, ఎస్సీ, జనరల్ మహిళ, జనరల్, ఎస్సీ మహిళ, జనరల్ మహిళ, జనరల్, ఎస్సీ, జనరల్, ఎస్సీ మహిళ, ఎస్సీ, ఎస్సీ మహిళ, జనరల్, హేమావతి సర్పంచ్ స్థానానికి బీసీ, 14 వార్డులకు బీసీ మహిళ, బీసీ మహిళ, జనరల్, జనరల్, జనరల్ మహిళ, జనరల్ మహిళ, జనరల్ మహిళ, బీసీ, ఎస్సీ మహిళ, బీసీ, జనరల్ మహిళ, జనరల్, ఎస్సీ, ఎస్సీ, మద్దనకుంట సర్పంచ్ స్థానానికి బీసీ (మహిళ), 12 వార్డులకు గాను జనరల్ మహిళ, జనరల్, బీసీ, జనరల్ మహిళ, జనరల్, ఎస్సీ మహిళ, జనరల్ మహిళ, జనరల్, బీసీ మహిళ, బీసీ మహిళ, ఎస్సీ, బిసి, నిద్ర గట్టసర్పంచ్ స్థానానికి ఎస్సీ, బిసి, ఎస్సీ మహిళ, బీసీ మహిళ, జనరల్, జనరల్ మహిళ, జనరల్, జనరల్ మహిళ, ఎస్సీ, జనరల్, జనరల్ మహిళ, బీసీ, ఎస్సీ మహిళ, కేశివరం సర్పంచ్ స్థానానికి ఎస్సీ, 12 వార్డులకు జనరల్ మహిళ, బీసీ మహిళ, ఎస్సీ, జనరల్, జనరల్ మహిళ, ఎస్సీ, జనరల్, జనరల్ మహిళ, బీసీ మహిళ, ఎస్సీ, జనరల్, బీసీ మహిళ, జనరల్ మహిళ, తమ్మడేపల్లి సర్పంచ్ స్థానానికి జనరల్, 14 వార్డులకు గాను బీసీ మహిళ, జనరల్, బిసి, జనరల్, జనరల్ మహిళ, జనరల్ మహిళ, జనరల్ మహిళ, బిసి, ఎస్సీ మహిళ, జనరల్, జనరల్, ఎస్సీ మహిళ, ఎస్సీ, బీపీ మహిళ, వి .అగ్రహారం సర్పంచ్ స్థానానికి ఎస్సీ (మహిళ), 12 వార్డులకు బిసి మహిళ, జనరల్ మహిళ, జనరల్, జనరల్, ఎస్సీ మహిళ, ఎస్సీ మహిళ, జనరల్ మహిళ, జనరల్, జనరల్ మహిళ, బీసీ, ఎస్సీ మహిళ, జనరల్, బీసీ మహిళ, జనరల్, ఎస్సీ, ఎస్సీ వారిగా రిజర్వేషన్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు.

రూ.2.18 కోట్ల ఎగ్జిబిషన్ ఒప్పందం.. చెల్లించింది రూ.55 లక్షలే!



ప్రొద్దుటూరు, నవంబర్ 11, (సీమ వార్త) : మున్సిపాలిటీకి ఎగ్జిబిషన్ కాంట్రాక్టర్ చెల్లించాల్సిన బకాయిల వసూళ్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ డిజిగ్నేటెడ్ చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయంతో పాటు ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీని కూడా నిబంధనల ప్రకారం వసూలు చేయాలని కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌కు సూచించారు. మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఎగ్జిబిషన్ నిర్వహణకు సంబంధించి కాంట్రాక్టర్ మాదుళ్లపల్లి శివకుమార్ బహిరంగ వేలంలో జీఎస్టీతో కలిపి రూ.2.18 కోట్లకు బిడ్ దక్కించుకున్నారని కమిషనర్ వివరించారు. 45 రోజులపాటు ఎగ్జిబిషన్ నిర్వహణకు అనుమతి పొందినప్పటికీ ఇప్పటివరకు రూ.55 లక్షలు మాత్రమే చెల్లించారని తెలిపారు. ఒప్పందం ప్రకారం నవంబర్ 26 వరకు గడువు ఉందని, బకాయిల చెల్లింపునకు ఇప్పటికే నాలుగు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, బుధవారం కాంట్రాక్టర్ ఎగ్జిబిషన్ సామగ్రిని తరలించేందుకు ప్రయత్నించడంతో మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. కమిషనర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, రెవెన్యూ అధికారులు మైదానానికి చేరుకుని సామగ్రి తరలింపును అడ్డుకునే చర్యలు చేపట్టారు. పోలీసుల సహకారం తీసుకోవడంతో పాటు, మూడు షిఫ్టుల్లో సిబ్బందికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. అసిస్టెంట్ కమిషనర్ కాంట్రాక్టర్‌తో మాట్లాడి బకాయిలను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ఎగ్జిబిషన్ సామగ్రిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. మున్సిపాలిటీకి రావాల్సిన ప్రతి రూపాయిని నిబంధనల ప్రకారం వసూలు చేయాలని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని నంద్యాల రాఘవరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ నూర్‌బాషా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విజయ్, పోలీసు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సాయి సత్యవ్రతంలో పాల్గొన్న 50 జంటలు.



ధర్మవరం నవంబర్ 11 సీమ వార్త; ధర్మవరం పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న భగవాన్ శ్రీ సాయిబాబా భజన మందిరంలో సామూహిక సాయి సత్యవ్రతం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 23న భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పూజారి ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సామూహిక సత్యసాయి వ్రతంలో మొత్తం 50 జంటలు పాల్గొన్నారు. వేద మంత్రోచ్ఛారణలు, భక్తి గీతాల నడుమ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, కుటుంబ సభ్యులతో కలిసి సత్యసాయి వ్రతాన్ని ఆచరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. భజన మందిరం ఆధ్యాత్మిక వాతావరణంతో భక్తి పరవశంతో భక్తాదులు పూజలు నిర్వహించారు

11వ వార్డులో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అభివృద్ధి పనులు.

11వార్డు కౌన్సిలర్ జూటూరు వెంకటేష్.



ధర్మవరం నవంబర్ 11సీమ వార్త : ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో విద్యుత్ దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించి, ప్రజల సౌకర్యార్థం నూతన విద్యుత్ దీపాలను 11వార్డు కౌన్సిలర్ జూటూరు వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయించడం జరిగింది. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వర్యులు సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి హరీష్ బాబు మరియు చైర్మన్ పరిసే సుధాకర్ సూచనలతో, వార్డులోని ప్రతి సమస్యను పరిష్కరిస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు .కూటమి నాయకులు, కార్యకర్తల సహకారంతో వార్డు అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని, ప్రజా సేవే లక్ష్యం... వార్డు అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని,11వ వార్డు కౌన్సిలర్ జూటూరు వెంకటేష్ తెలిపారు.

సింగిల్ విండోలో ఓటు హక్కు ఉన్న రైతులు ఈ-కేవైసీ చేయించుకోండి.

:-జనవరిలో ఎన్నికలు.

:-సభ్యులకు అధికారులు సూచన.

పెనుకొండ నవంబర్, 11 సీమవార్త. ఇస్లాపురం సింగిల్ విండో పరిధిలో ఉన్న రైతులందరూ తమ సభ్యత్వానికి సంబంధించి తప్పనిసరిగా ఈ-కేవైసీ చేసుకోవాలని సొసైటీ సీఈఓ హరికృష్ణ, సొసైటీ అధ్యక్షులు పోతిరెడ్డి బుధవారం ఓప్రకటనలో తెలిపారు.ఇస్లాపురం సొసైటీ పరిధిలో సభ్యత్వం కలిగిన ప్రతిరైతు ఈ-కేవైసీ చేయించుకోనేందుకు ఆధార్ కార్డు జిరాక్స్, ఓటర్ కార్డు జరాక్స్, భూమికి సంబంధించిన పత్రాల జరాక్స్, పాస్ ఫోటో తో పాటు ఆధార్ కార్డు కు లింకైన మొబైల్ నంబర్ ను సొసైటీ లో అందజేసి ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాలన్నారు. త్వరలో సొసైటీ ఎన్నికలు జరుగుతున్న నైపథ్యంలో ఈ అవకాశాన్ని సభ్యత్వం కలిగిన ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేదంటే సోసైటీలో ఓటు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

ఎంపీపీ... జడ్పీటీసీ కు ఘన సన్మానం.



పెనుకొండ నవంబర్11సీమవార్త. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా టీడీపీ అభ్యర్థులు గా పెనుకొండ జడ్పీటీసీ, నాగలూరు ఎంపీటీసీ గా గెలుపొందిన యశోద కేశవయ్య, దండుమమత ఈశ్వరప్రసాద్ లను బుధవారం పూలమాల వేసి శాలువతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసేవ చేవ కోసం పాటు పడాలన్నారు. రాజకీయ చతురత కలిగిన నాయకులుగా పెరు పొందారన్నారు. ఇంకను ఉన్నత పదవులు పొంది ప్రజలకు చేవ చేయాలన్నారు. కార్యక్రమం లో కౌన్సిలర్ లు దారపనేని రామలింగ, బాబుల్ రెడ్డి, మరువపల్లి శ్రీనాథ్, రఘువీర చౌదరి, మంజునాథ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కడప ఉప మేయర్ ఎన్నికకు నవంబర్ 23న ముహూర్తం ఖరారు



కడప, నవంబర్ 11, (సీమ వార్త) : కడప నగర పాలక సంస్థ ఉప మేయర్ ఎన్నికను నవంబర్ 23వ తేదీన నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నవంబర్ 18న ఫారం- ద్వారా మేయర్, ఎన్నికైన సభ్యులు, పదవీరీత్యా సభ్యులకు ప్రత్యేక సమావేశ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. నవంబర్ 23న ఉదయం 11 గంటలకు నగర పాలక సంస్థలో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉప మేయర్ ఎన్నిక చేపడతామని పేర్కొన్నారు. అనివార్య కారణాలతో ఆ రోజు ఎన్నిక జరగకపోతే నవంబర్ 24న ఉదయం 11 గంటలకు నిర్వహించాలని, ఆ రోజు సెలవు అయినప్పటికీ ఎన్నిక జరపాలని ఎన్నికల సంఘం సూచించినట్లు వివరించారు. ఆ రోజు కూడా ఎన్నిక సాధ్యం కాకపోతే తదుపరి తేదీ నిర్ణయం కోసం రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం, 1955, ఉప మేయర్ ఎన్నికల నిర్వహణ నిబంధనలు--2026 ప్రకారం చేపట్టాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

బాలల భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి



కడప, నవంబర్ 11 (సీమ వార్త) : బాలల హక్కులు, వ్యక్తిగత భద్రతపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. రాయచోటి రోడ్డులోని శ్రీ చైతన్య కె7 పాఠశాలలో బుధవారం 'సురక్షిత బాల్యం -- సమాజ బాధ్యత' అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ సూచనలతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ పోక్సో చట్టం--2012, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, ఆన్‌లైన్ మోసాలు, వేధింపుల నుంచి రక్షణ పొందే మార్గాలపై విద్యార్థులకు వివరించారు. ఏదైనా సమస్య ఎదురైతే ఎవరిని సంప్రదించాలి, ఫిర్యాదు ఎలా చేయాలి, ఉచిత న్యాయ సహాయం ఎలా పొందవచ్చనే అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా నవంబర్ 10 నుంచి 24వ తేదీ వరకు తొలి విడతగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ శాంత, వినయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, మనోహర్, రవితేజ, డీఎల్ఎస్ఏ సిబ్బంది, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ వన్నూరస్వామికి బీజేపీ అగ్రనేతల అభినందనలు

...మంత్రి సత్యకుమార్, కాపు రామచంద్రారెడ్డి సమక్షంలో ఘన సత్కార





డి.హిరేహాల్, నవంబర్ 11 (సీమవార్త): బళ్లారి పట్టణంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు బళ్లారి బీజేపీ పార్టీ కార్యాలయంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో డి.హిరేహాల్ మండలం జడ్పీటీసీ కూటమి అభ్యర్థిగా విజయం సాధించిన అనంతపురం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ఎం. వన్నూరస్వామిని మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో పాటు పలువురు ప్రముఖ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి వన్నూరస్వామికి శుభాకాంక్షలు తెలియజేసి, శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో బళ్లారి నగర మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బళ్లారి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు అనిల్ తదితర ప్రముఖ నాయకులు పాల్గొని వన్నూరస్వామిని సత్కరించారు.

విద్యా విస్తరణకు మౌలానా ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయం



ప్రొద్దుటూరు, నవంబర్ 11, (సీమ వార్త) : దేశంలో విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన భారత తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని విశ్రాంత ఉప విద్యాశాఖాధికారులు క్రిస్టోఫర్, చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ విద్య అందించాలనే లక్ష్యంతో ఉచిత ప్రాథమిక విద్య, వయోజన విద్య, సాంకేతిక విద్య అభివృద్ధికి ఆజాద్ విశేష కృషి చేశారని తెలిపారు. యూజీసీ, ఐఐటీలు వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల అభివృద్ధికి పునాది వేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అనంతరం మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ సాధు గోపాలకృష్ణ, ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ టి.డి. వరుణ్ కుమార్ రెడ్డి, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, ఇమామ్ హుస్సేన్, గౌస్ లాజం, డాక్టర్ పంజగల మధుసూదన్ బాబు, అల్తాఫ్, ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, ఉపాధ్యాయులు డి. భాస్కర్ రావు, ప్రభాకర్ రెడ్డి, బోగా గంగాధర్, సుధాకర్, కె.పి. ఓబులరెడ్డి, కొండన్న, గోవింద్ మోరే, చంద్ర మౌళి, రాజామణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు సాయం చేసేవారికి చట్టపరమైన రక్షణ



కడప, నవంబర్ 11, (సీమ వార్త) : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ మానవత్వంతో ముందుకు రావాలని, బాధితులకు సాయం చేసే వారికి చట్టపరమైన రక్షణ ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్ తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని తన ఛాంబర్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్‌తో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసే మంచి మనసున్న వ్యక్తుల (గుడ్ సమారిటన్స్) హక్కులపై అవగాహన కల్పించారు. ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. సహాయం చేసిన వ్యక్తులను పోలీసులు, ఆసుపత్రి సిబ్బంది అనవసరంగా ఇబ్బంది పెట్టకూడదని, వారి వ్యక్తిగత వివరాలు వెల్లడించాలంటూ బలవంతం చేయరాదని తెలిపారు. బాధితులను ఆసుపత్రిలో చేర్చిన అనంతరం సహాయకులు వెళ్లిపోవచ్చని, వైద్య ఖర్చులు చెల్లించాలని వారిని ఒత్తిడి చేయకూడదని స్పష్టం చేశారు. ప్రమాద బాధితులకు పోలీసు విచారణ, ఇతర లాంఛనాలతో సంబంధం లేకుండా తక్షణ వైద్యం అందించాలని, ముందుగా ప్రాణాలను కాపాడటమే ప్రాధాన్యంగా ఉండాలని సూచించారు. సహాయకులు లేదా బాధితుల హక్కులకు భంగం కలిగితే ఆసుపత్రిలోని నోడల్ అధికారికి లేదా వైద్య పర్యవేక్షకుడికి ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ఆపద సమయంలో స్పందించి ఒకరి ప్రాణాన్ని కాపాడటం గొప్ప మానవతా బాధ్యతని, సహాయం చేయడానికి ఎవరూ వెనుకాడవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కెంపుల క్యాంపస్ లో... ఇన్ఫోసిస్ ల్యాండ్.

.....కెంపుల కళాశాలలో మరి...విద్యార్థులకు ఇన్ఫోసిస్ సంస్థ ట్రైనింగ్.

.... విద్యార్థులకు సువర్ణ అవకాశం సద్వినియోగం చేసుకోండి... కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ.

..... ఏపీ స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి చైతన్య, ట్రైనర్ భాను ఆధ్వర్యంలో కార్యక్రమాలు.



గోరంట్ల నవంబర్ 11 సీమ వార్త గోరంట్ల పట్టణంలోని ప్రభుత్వ ఎయిడెడ్ జూనియర్ ఎస్ ఏ పి ఎస్ కళాశాల మరియు ఏ ఎన్ కె డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఇన్ఫోసిస్ సంస్థకు చెందిన ప్రత్యేక బస్సు వాహనంలో విద్యార్థులకు భవిష్యత్తు ఉద్యోగాలకు ఉపయోగపడే శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎపిఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సూర్యనారాయణ కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి చైతన్య, ట్రైను భాను ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో ఆరు నుంచి బీటెక్ చదివిన విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రోబోటిక్, మైక్రో కంప్యూటర్, పిడి ప్రింటర్స్, డిజైనింగ్, ఎలక్ట్రానిక్స్ వడ్డీ వాటిపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఒక్కో బ్యాచ్ 25 మంది చొప్పున రోజుకు నాలుగు బ్యాచులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో లక్ష్యసాధనకు విద్యే పునాది -- ఎంపీజే



ప్రొద్దుటూరు, నవంబర్ 11, (సీమ వార్త) : విద్యార్థుల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందించి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను తెలియజేసే లక్ష్యంతో బుధవారం ఎంపీజే ఆధ్వర్యంలో స్థానిక ఇస్లామిక్ హైస్కూల్‌లో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప విద్యాశాఖ అధికారి శివప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి శోభారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలని కోరారు. ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం భాష విద్యా ప్రాముఖ్యతను వివరించగా, రాయలసీమ ఇన్‌చార్జి ఎండీ అయూబ్ ఖాన్ చదువుపై శ్రద్ధ చూపాలని, సెల్‌ఫోన్ల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. అనంతరం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్రపై వ్యాసరచన, వ్యక్తిత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ భాష, కార్యదర్శి మహమ్మద్ రఫీ, సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షాహిద్, కరస్పాండెంట్ ఉమర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనదారుల ఇబ్బందులు తొలగించేందుకు పార్కింగ్ స్థలాల గుర్తింపు



ప్రొద్దుటూరు, నవంబర్ 11, (సీమ వార్త) : పట్టణంలో పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో మున్సిపల్ ప్రతిపాదిత చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి బుధవారం పలు ప్రాంతాలను పరిశీలించారు. శివాలయం సర్కిల్ సమీపంలోని నందిని కాంప్లెక్స్ కింద ఉన్న స్థలంతో పాటు టీటీడీ కల్యాణ మండపం స్థలాన్ని పరిశీలించి పార్కింగ్ సౌకర్యం ఏర్పాటుకు ఉన్న అవకాశాలను తెలుసుకున్నారు. పట్టణంలో వాహనాల రద్దీకి అనుగుణంగా పార్కింగ్ వసతులు కల్పించేందుకు ఈ పరిశీలన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బద్వేలు శ్రీనివాసులు రెడ్డి, మార్కెట్ కమిటీ ఇంచార్జ్ చైర్మన్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మా మద్దతు మీకే అంటున్న వినాయక నగర్ కాలనీ వాసులు



సోమందేపల్లి నవంబర్ 11 సీఎం వార్త సోమందేపల్లి వినాయక నగర్ కాలనీలో ఎన్నికల సందడి నెలకొంది. కాలనీ అభివృద్ధిని కాంక్షిస్తూ వినాయక నగర్ కాలనీ వాసులంతా ఏకతాటిపైకి వచ్చి సర్పంచ్ అభ్యర్థి సిసి హరికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాలనీ సంక్షేమం, అభివృద్ధి సిసి హరితోనే సాధ్యమని పేర్కొంటూ గ్రామ సర్పంచ్‌గా ఆయనకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కాలనీ వాసులు ముక్తకంఠంతో స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు ప్రముఖులు సి.సి హరికి పూలమాలవేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో కాలనీ నుంచి భారీ మెజారిటీతో ఆయనను గెలిపించుకుంటామని వారు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో తూముకుంట వెంకటరాముడు, ఎల్ఐసి మహమ్మద్, పూజారి నరసింహులు, శ్రీధర్, సీతారాం వెంకటరాముడు, శనివారమయ్య, పి.ఎన్. వెంకటేష్, బలిజ శీనా, పాలిష్ చలపతి, గుర్రం శీనా, కొలిమి గోపి, తూముకుంట బాలు, జక్కా చంద్ర, గుళూరు చంద్ర, చుక్కల రెడ్డెప్ప, మంచాల అశోక్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులు



బ్రహ్మంగారిమఠం, నవంబర్ 11, (సీమ వార్త) : శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బుధవారం మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి ప్రారంభోత్సవం చేశారు. ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన ఈశ్వరిదేవి మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీర శివకుమార స్వాముల సమక్షంలో అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దాతల సహకారంతో రూ.7 నుంచి 8 లక్షల వ్యయంతో యాగశాల, సుమారు రూ.3 లక్షలతో పశ్చిమ ద్వారం, రూ.2 లక్షలతో దివ్యాంగుల సౌకర్యార్థం ప్రత్యేక ప్రవేశ ద్వారం నిర్మాణ పనులు చేపట్టినట్లు మఠం మేనేజర్ పల్లకొండ పెంచల నరసింహ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, శిష్యులు, స్థానికులు, మీడియా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా యూనియన్ బ్యాంకు ఆవిర్భావ దినోత్సవం....



తనకల్లు, నవంబర్ 11 సీమ వార్త న్యూస్.... తనకల్లు మండల పరిధిలోని బాలసముద్రం బ్రాంచ్ కొక్కంటి క్రాస్ లోని యూనియన్ బ్యాంకు లో మేనేజర్ పులి నరేష్ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు 108 ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మేనేజర్ పులి నరేష్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు యొక్క ఆవశ్యకతను ఖాతా దారులకు వివరించడం జరిగింది. ఖాతా దారులను, బ్యాంకు వినియోగదారులను ముఖ్య అతిథులుగా పిలిపించి కేక్ కట్ చేయించి ప్రతి ఖాతాదారుడు బ్యాంకు యొక్క లావాదేవీలు బాగ జరిగే విదంగా సంహరించాలని మేనేజర్ కోరారు. ఖాతాదారులు కేక్ కోసి సంబరాలు చేసుకొన్నారు ఈ సందర్భంగా. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్స్ నవీన్ కుమార్, విక్రమ్, విష్ణువర్ధన్ రెడ్డి, సాయితేజ రెడ్డి, వాసుదేవచారి, ఆది,శీను, ఖాదారులు బాగేపల్లి అశోక్, కార్తిక్, సిద్ధారెడ్డి, పూజారి మహేష్,నాగబయరెడ్డి, అంజనేయులు, లక్ష్మి ప్రసాద్,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు దిక్సూచి అబ్దుల్ కలాం.

.... శ్రీకృష్ణదేవరాయ, ఎస్ పి వి ఎంకళాశాలలో....జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు.



గోరంట్ల నవంబర్ 11 సీమ వార్త స్థానిక శ్రీ కృషదేవరాయ జూనియర్ కళాశాల మరియు ఎస్ పీ వి యం డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా కళాశాలల ప్రిన్సిపల్స్ విజయలక్ష్మి భక్తవత్సలం ల అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ పి ఓ లు అజాద్, బాల మోహన్ మరియు దోని మోహన్ ల పర్యవేక్షణలో స్వాతంత్ర్యానంతరం భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖామాత్యులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని కళాశాలల్లో జాతీయ విద్యాదినోత్సవం యొక్క వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ మరియు అధ్యాపకులు ప్రసంగిస్తూ భారత ప్రభుత్వానికి మౌలానా అబుల్ కలాం అజాద్ మొదటి విద్యాశాఖామాత్యులుగా సుదీర్ఘంగా 11 సంవత్సరాలు కాలం పాటు పని చేస్తూ విద్యావిధానంలో అనేక సంస్కరణలను తీసుకుని రావడం జరిగింది. ప్రాథమిక విద్య, సెకండరీ విద్యలో ప్రత్యేక కమిషన్ లను ఏర్పాటు చేసి విద్యావిధానాన్ని పటిష్టం చేయడం జరిగింది. ఉన్నత విద్యకు వయోజన విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ సంస్కరణలను చేయడం జరిగింది. విద్యారంగానికి చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం గుర్తించి వీరికి అత్యున్నతమైన భారతరత్న పురస్కారంతో గౌరవించింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు.

దామిరోడ్డు అయ్యప్ప గుడి లో....మాలధారణ కార్యక్రమం.



గోరంట్ల నవంబర్ 11 సీమ వార్త గోరంట్ల దామిరెడ్డిలోని శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా అయ్యప్ప స్వామి భక్తులు భక్తిశ్రద్ధలతో, శరణుఘోషల నడుమ అయ్యప్ప మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. గురుస్వామి గుంతపల్లి మూర్తిఆధ్వర్యంలో భక్తులు మాలధారణ చేసి స్వామివారి దీక్షను ప్రారంభించారు. అలాగే కొద్ది రోజుల్లో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బూదిలి హై స్కూల్ ను సందర్శించిన... జిల్లా అసిస్టెంట్ కమిషనర్.

గోరంట్ల నవంబర్ 11 సీమ వార్త. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బూదిలిని శ్రీ సత్యసాయి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎగ్జామినేషన్స్ శ్రీ లాజర్ సందర్శించడం జరిగింది. అలాగే మా పాఠశాలలో ఓపెన్ స్కూల్ సెంటర్ ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది తర్వాత పాఠశాలలో జరుగు ఎగ్జామ్స్ పరిశీలించి పదవ తరగతి విద్యార్థులకు నూటికి నూరు శాతం రిజల్ట్ రావడానికి తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఓపెన్ స్కూల్లో పిల్లలను చేర్పించే బాధ్యత ను అందరు తీసుకోవాలని తల్లితండ్రులును భాగస్వామ్యం చేసుకోవాలని తెలియజేయడం జరిగింది.

స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాశీ ఖని చేసిన కూటమి ప్రభుత్వం

సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు వీరభద్ర స్వామి



గుంతకల్ నవంబర్ 11 సీమా వార్త గుంతకల్ స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని కానీ చేసిన కూటమి అధికార దుర్వినియోగం చేసిందని సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు వీరభద్ర స్వామి సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో కళ్లకు నల్ల రెబ్బలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షతగా సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ ఎండి గౌస్ నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ రాష్ట్ర పిలుపుమేరకు సిపిఐ , సిపిఎం పట్టణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఎన్నికలను స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా నిర్వహించడం లో పూర్తిగా విపమయ్యారని వెంటనే రాజీనామా చేయాలని నిరసన చేపట్టారు.ఎన్నికల ప్రక్రియలో చోటు చేసుకున్న ప్రజాస్వామ్య వ్యతిరేక పరిణామాలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జడ్పిటిసి ఎంపిటిసిల నామినేషన్ ప్రక్రియలో డి.ఎస్.పి కసాపురం సిఐ, ఎస్ఐ కుటుంబ ప్రభుత్వానికి నిక్షిప్తపద్దంగా పనిచేశారని తీయబడ్డారు. మా పార్టీ వాళ్లు నామినేషన్ వేసేయకపోతే పోలీసులు సమక్షంలోనే కూటమి నాయకులు పత్రాలు చిందువేయడం జరిగిందని అన్నారు. ఈ విషయాలు మా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దృష్టికి తీసుకోవడం జరిగింది. వీరిపై కూడా ఎలక్షన్ కమిషన్కు కంప్లైంట్ చేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. బలవంతపు ఏకగ్రీవాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎన్నికల క్రమంగానికి సంపూర్ణ స్వతంత్రం కల్పించాలని పోటీ చేసే హక్కు స్వేచ్ఛగా ఓటు వేసి హక్కును కాపాడమని అన్నారు. ప్రభుత్వాలు మారాలి గాని ప్రజాస్వామ్య విలువలు మారకూడదని అంబేద్కర్ రాజ్యాంగంలో ప్రజలకు ఓటు హక్కు ఇచ్చాడని కానీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని విరుద్ధంగా పాములేషన్ పత్రాలు చింపడం రిగ్గింగ్ చేయడం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల అధ్యక్షులు కార్యదర్శులు దాసరి శ్రీనివాసులు, ఈశ్వరయ్య, సిపిఐ నాయకులు మల్లయ్య, ప్రసాదు, ప్రజానాట్యమండలి నాయకులు కొల్లాయప్ప, ఉమర్ భాష ఏఐవైఎఫ్ నాయకులు నందు ఆటో యూనియన్ నాయకులు అంజి నరేష్ పాత గుంతకల్ హమాల్ యూనియన్ ట్రాన్స్పోర్ట్ హమాల్ యూనియన్, సిపిఎం కార్యదర్శులకు సభ్యులు సాకే నాగరాజు ,సురేంద్ర, పట్టణ కమిటీ సభ్యులు అబ్దుల్ ,తిమ్మప్ప, రామయ్య ,ఈరన్న , షేక్షావలి,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

11వ వార్డులో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అభివృద్ధి పనులు.

11వార్డు కౌన్సిలర్ జూటూరు వెంకటేష్.



ధర్మవరం నవంబర్ 11సీమ వార్త : ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో విద్యుత్ దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించి, ప్రజల సౌకర్యార్థం నూతన విద్యుత్ దీపాలను 11వార్డు కౌన్సిలర్ జూటూరు వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయించడం జరిగింది. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వర్యులు సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు, నియోజకవర్గ ఇన్ఛార్జి హరీష్ బాబు మరియు చైర్మన్ పరిసే సుధాకర్ సూచనలతో, వార్డులోని ప్రతి సమస్యను పరిష్కరిస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు . కూటమి నాయకులు, కార్యకర్తల సహకారంతో వార్డు అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని, ప్రజా సేవే లక్ష్యం... వార్డు అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని,11వ వార్డు కౌన్సిలర్ జూటూరు వెంకటేష్ తెలిపారు.

సొసైటీలో ఓటు హక్కు ఉన్న ప్రతి రైతు కు .... ఈ కేవైసీ తప్పనిసరి.

.... వానవోలు రైతు సహకార సొసైటీ సీఈవో.




గోరంట్ల నవంబర్ 11 సీమ వార్త వానవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ఓటు హక్కు కలిగిన రైతు సభ్యుల ఓటరు జాబితా తయారీకి సంబంధించి ఆన్లైన్ ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఓటు హక్కు కలిగిన ప్రతి రైతు సభ్యుడు తప్పనిసరిగా తమ ఆధార్ నంబర్ ద్వారా ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారు. త్వరలో సొసైటీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున, సభ్యులందరూ తమ ఆధార్ కార్డుతో సొసైటీ కార్యాలయానికి వచ్చి ఈ కేవైసీ చేయించుకోవాలని కోరుతున్నాము. ఆధార్కు మొబైల్ నంబర్ లింక్ ఉన్నవారు ఓటీపీ ద్వారా, లింక్ లేనివారు వేలిముద్ర ద్వారా ఈ కేవైసీ పూర్తి చేసుకోవచ్చు. ఈ ప్రక్రియను ఐదు పని దినాల్లో పూర్తి చేయాలని సూచించినందున రైతు సోదరులు వెంటనే స్పందించవలసిందిగా మనవి. మా సహకార సంఘ సిబ్బంది రైతులకు ఈ కేవైసీ చేయించడంలో పూర్తి సహకారం అందిస్తారు. అవసరమైన గ్రామాలకు కూడా సిబ్బంది వచ్చి ఈ సేవలు అందిస్తారు. ముఖ్య గమనిక: సొసైటీలో సభ్యత్వం ఉండి, ఓటు హక్కు కలిగిన వారు ఈ కేవైసీ చేయించుకోకపోతే ఓటరు జాబితాలో వారి వివరాలు నమోదు కాకపోవడం, తద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. కావున ఈ ముఖ్యమైన సమాచారాన్ని తమ దినపత్రికలో వార్త రూపంలో ప్రచురించి, వానవోలు సొసైటీ పరిధిలోని రైతు సభ్యులందరికీ అవగాహన కల్పించవలసిందిగా సీఈఓ విజ్ఞప్తి చేశారు. ఈ కేవైసీ కొరకు 9490011121, 9949401527, 7780579396 నంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

నూతన జడ్పిటిసి కి ఘనంగా సన్మానం



మడకశిర నవంబర్ 11 సీమ వార్త నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండల నూతన జడ్పిటిసిగా సురేష్ లక్ష్మీ దేవమ్మ 4800 ఓట్ల మెజారిటీతో గెలపొందడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ కే ఎన్ పల్లి గ్రామానికి వెళ్లి నూతన జడ్పిటిసిని ఘనంగా సన్మానిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధిగా కేఎన్ పల్లి సురేష్ ఎన్నో కార్యక్రమాలు చేయడం జరిగిందని దానిలోని భాగంగానే ఈసారి సురేష్ తల్లి లక్ష్మీదేవమ్మకు టికెట్ కేటాయించడంతో ఆమె భారీ మెజార్టీతో గెలుపొందడంతో నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరు సురేష్ కుటుంబాన్ని అభినందిస్తున్నారు. దానిలోని భాగంగానే బుధవారం నియోజకవర్గ పరిధిలోని ఆగలి మండలం ఇరిగేపల్లి నూతన ఎంపీటీసీ లక్ష్మమ్మ లింగన్న ఆ గ్రామానికి వెళ్లి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.

ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులకు శిక్షణ తరగతులు



మడకశిర నవంబర్ 11 సీమ వార్త మడకశిర డివిజన్ నందు రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి స్టేజ్ 1 , స్టేజ్ 2 ఆఫీసర్లుగా నియామకమైన వారికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించడమైనది. ఇందులో మాస్టర్ ట్రైనర్లుగా ఆముదాలగొంది స్కూల్ అసిస్టెంట్ సురేంద్ర, గౌరీపురం టీచర్ రామ్మోహన్ ని నియమించడమైనది. ఈ కార్యక్రమం నందు ఆర్డిఓ నాగప్రసన్నలక్ష్మి , డి ఎల్ పి ఓ శివనారాయణరెడ్డి , ఎంపీడీవో డిప్యూటీ ఎంపీడీవో పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ లను విస్తృత పర్యటన చేసిన తహసీల్దార్, ఎంపీడీఓ,ఎస్ ఐ

-- మూడు పంచాయతీ గ్రామాల ఓటింగ్ రూమ్ లు పరిశీలన



సోమందేపల్లి నవంబర్ 11 సీమ వార్త త్వరలో జరగనున్న స్థానిక (పంచాయతీ) ఎన్నికల సందర్భంగా అధికారులు బుధవారం తహసీల్దార్ మారుతీ మారుతి ప్రసాద్, ఎంపీడీఓ వెంకటలక్ష్మి,ఎస్ ఐ సుధాకర్ యాదవ్ సోమందేపల్లి మండలం లోని బ్రహ్మసముద్రం, మాగేచెరువు, మండ్లి గ్రామాల్లో పర్యటించారు. సర్పంచ్ ఎన్నికలు జరిగే పోలింగ్ స్టేషన్ లలో సౌకర్యాలు భద్రతా తదితర అంశాలు పరిశీలన చేశారు. పోలింగ్ రూమ్ లో ఎంత మంది ఉండగలరు, పోలింగ్ సిబ్బందికి కావాల్సిన సదుపాయలు, పోలీస్ భద్రత పై క్షుణ్ణంగా పర్యవేక్షణ చేశారు.

విజయోత్సవ ర్యాలీనీ జయప్రదం చేయండి



మడకశిర నవంబర్ 11 సీమ వార్త పట్టణంలో గురువారం 10 గంటలకు జరిగే విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని జెడ్పిటిసి గుండుమల చంద్రప్ప తెలిపారు. కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించి 100% స్ట్రైక్ రేట్ తో ముందుకు వెళుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందనిఎమ్మెల్సీ ఎం.ఎస్. రాజు , మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలోమున్సిపాలిటీతో పాటు 5 మండలాల జడ్పిటిసిలు, ఎంపీపీ స్థానాల్లో కూటమి విజయాన్ని పురస్కరించుకుని ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహణ చేయడం జరిగిందన్నారు. గురువారం 12-11-2026,సమయం: ఉదయం 10:00 గంటలకు పట్టణంలోని ఆర్టీసీ డిపో నుండి ప్రారంభమై, అమరాపురం బస్టాండ్ లోని పూలే సర్కిల్ వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు మరియు ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయగలరు అని నూతన జడ్పిటిసి గుండుమల చంద్రప్ప తెలిపారు.

నూరు వాహనాలతో విజయోత్సవ ర్యాలీకి సన్నద్ధం



మడకశిర నవంబర్ 11 సీమ వార్త పట్టణంలో గురువారం జరిగే తెలుగుదేశం పార్టీ విజయోత్సవ ర్యాలీకి నియోజకవర్గ పరిధిలోని ఆగలి మండలం హళ్లి కేర గ్రామం నుండి నూరు వాహనాలతో విజయోత్సవ ర్యాలీకి తరలివస్తున్నట్లు ఎంపీటీసీ కనక లక్ష్మీ రాజన్న, యూనిట్ ఇంచార్జ్ గుర్నాథ్ తెలిపారు. శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమాల చెప్పే స్వామి ఆధ్వర్యంలో గురువారం పట్టణములు ఆర్టీసీ బస్టాండ్ నుండి జ్యోతిరావు పూలే విగ్రహం వరకు జరిగే ర్యాలీకి భారీగా తరలివస్తున్నట్లు వారు తెలిపారు. ముందుగా హళ్లీ కిరా గ్రామము నుండి అగళీ వరకు తరలి వెళ్లి అక్కడి నుండి నేరుగా మడకశిర వరకు భారీ ర్యాలీతో విజయోత్సవ ర్యాలీకి హాజరవుతున్నట్లు ఎంపీటీసీ కనక లక్ష్మీ రాజన్న, యూనిట్ ఇంచార్జ్ గుర్నాథ్, మాజీ సింగల్ విండో డైరెక్టర్ రఘు, నందకుమార్ గురునాథ్ తదితరులు తెలిపారు.

నేషనల్ ఎడ్యుకేషన్ డే.





హిందూపురం: నవంబర్ 11 సీమ వార్త. స్థానిక ఆజాద్ నగర్ లోని మౌలానా అబుల్ కలాం ప్రాథమికో న్నత పాఠశాలలో ఘనంగా నేషనల్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమం జరిగింది. కార్యక్రమా నికి అతిథిగా ఎం ఈఓ గంగప్ప అజయ్ మౌలానా అబుల్ కలాం జీవిత చరిత్రను వివరించారు. అబుల్ కలాం ,అబ్దుల్ కలాం లాంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని అందరూ బాగా చదువుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ ఎం ఫైరోజా, యూనియన్ లీడర్ రవీంద్ర, టీచర్లు రిజ్వానా షహనాజ్ భారతి, విద్యార్థులు హాజరైరు.

అనంత ఆసుపత్రి లో.....గోవిందప్పను పరామర్శించిన తెలుగు తమ్ముళ్లు.



గోరంట్ల నవంబర్ 11 సీమ వార్త గోరంట్ల మండలం గౌని వారి పల్లి పంచాయతీ శీనప్ప ప్పల్లి గ్రామానికి చెందిన గోవిందప్ప కు అనంతపురం సూపర్ఆసుపత్రిలో శాస్త్ర చికిత్స చేయించుకున్న గోవిందప్ప ను బీసీ సంక్షేమ శాఖమంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు అనంతపురం వెళ్లి పరామర్శించిన మాజీ సర్పంచ్ ఉత్తమ్ రెడ్డి.సింగల్ విండో అధ్యక్షులు రవి మోహన్. మాజీ కో ఆప్షన్ గోరంట్ల అజంతుల్లా. గుంటుపల్లి ఈశ్వరయ్య. మల సముద్రం మాజీ సర్పంచ్ బాలకృష్ణ. సీనపల్లి గోవిందప్ప కలిసి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నటువంటి గోవిందప్పను పరామర్శించడమైనది

భయం వీడండి.....

ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయండి..!!



బొమ్మనహాల్, నవంబర్ 11 (సీమ వార్త): బొమ్మనహాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సమగ్ర శిక్ష ఏపీసీ మేడం శైలజ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల విద్యా ప్రమాణాలు, వసతి, భోజనం, ఆరోగ్య పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.విద్యార్థినులతో ఆప్యాయంగా మాట్లాడిన ఏపీసీ శైలజ పరీక్షల పట్ల భయాందోళనలు వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని సూచించారు. విద్యార్థినుల సమస్యలను తెలుసుకునేందుకు రాత్రి పాఠశాలలోనే బస చేశారు.మరుసటి రోజు ఉదయం విద్యార్థినులతో కలిసి యోగా, వ్యాయామ కార్యక్రమాలను పరిశీలించారు. వారి చదువులు, అభ్యసన సామర్థ్యం, పరీక్షల సన్నద్ధతపై ఆరా తీశారు. విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత, రోజువారీ కార్యక్రమాలను పరిశీలించారు. ఫిర్యాదుల పెట్టెలోని అంశాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి అల్పాహారం స్వీకరించారు.

100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

విజయపథం కార్యక్రమంలో భాగంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినుల కోసం ప్రత్యేక విద్యా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో బోధన చేపట్టి, విద్యార్థినులతో నిరంతరం అభ్యాసం చేయిస్తూ 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఏపీసీ శైలజ స్పష్టం చేశారు.

నూతన హాస్టల్‌ను పరిశీలించిన ఏపీసీ

అనంతరం బొమ్మనహాల్‌లో నూతనంగా నిర్మించిన టైప్-4 బాలికల హాస్టల్‌ను సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులకు వసతి కల్పించే అవకాశాలను పరిశీలించి, అర్హులైన విద్యార్థినులకు హాస్టల్‌లో వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మరియు మండల విద్యాధికారి కార్యాలయంలో ఏ పి సి మేడం గారిని శాలువాలతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వి. మల్లికార్జున్, కస్తూరిబా స్కూల్ ప్రిన్సిపల్ ఇ.బి. కమలమ్మ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, సీఆర్‌పీలు, హాస్టల్ పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే సమయంలో రెండు రాష్ట్రాల సమ్మిట్‌లు

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల మధ్య పారిశ్రామిక , పెట్టుబడుల సాధనలో సరికొత్త పోటీ వాతావరణం నెలకొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు దాదాపు ఒకే సమయంలో మెగా పెట్టుబడుల సదస్సులు నిర్వహిస్తున్నాయి. తెలంగాణలోని రేవంత్ రెడ్డి సర్కారు హైదరాబాద్ వేదికగా నవంబర్ 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు భారత్ సమ్మిట్ నిర్వహిస్తుండగా.. అటు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నం వేదికగా ప్రతిష్టాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ను నిర్వహిస్తోంది. రెండు రాష్ట్రాల సదస్సుల పేర్లు, వేదికలు వేరైనా.. వాటి అంతిమ లక్ష్యం మాత్రం ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలను ఆకర్షించి, వేల కోట్ల రూపాయల పెట్టుబడులను ఒడిసిపట్టడమే.ఒకే సమయంలో రెండు భారీ సమ్మిట్‌లు జరగనుండటంతో సహజంగానే కార్పొరేట్ వర్గాల్లో, మీడియాలో పోలికలు మొదలయ్యాయి. ఏ సమ్మిట్‌కు ఎలాంటి గ్లోబల్ దిగ్గజాలు హాజరవుతున్నారు? ఏ రాష్ట్రానికి ఎన్ని లక్షల కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదురుతున్నాయి? అన్న విషయాలపై అంచనాలు సాగుతున్నాయి. హైదరాబాద్ సమ్మిట్‌కు అంతర్జాతీయ ప్రతినిధులతో పాటు జాతీయ స్థాయి కార్పొరేట్ నెట్‌వర్క్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఆహ్వానిస్తుండగా.. విశాఖ సదస్సుకు 59 దేశాల ప్రతినిధులు, 15 మంది విదేశీ మంత్రులు, భారత ఉపరాష్ట్రపతి, కేంద్ర వాణిజ్య మంత్రితో పాటు సుమారు 1,250 మందికి పైగా ప్రముఖులను రప్పించేలా ఏపీ ప్రభుత్వం భారీ నెట్‌వర్క్‌ను రంగంలోకి దించింది.

స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిన ఆజాద్

విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యం

ఆసిఫాబాద్ : భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ విద్యావేత్త, దేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, భారతరత్న పురస్కార గ్రహీత మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను బుధవారం వాంకిడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు.కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు సెల్వట్కార్ పెంటు, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ అజీమోద్దీన్ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో మహాత్మాగాంధీతో కలిసి పనిచేస్తూ దేశ స్వేచ్ఛ కోసం తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తుచేశారు. ప్రజల్లో జాతీయ భావాన్ని, స్వాతంత్ర్య కాంక్షను పెంపొందించేందు కు విశేష కృషి చేశారని పేర్కొన్నారు.స్వాతంత్ర్యం అనంతరం దేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి విద్యారంగ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ విద్య



అందించాలనే లక్ష్యంతో ఉన్నత, సాంకేతిక విద్యతో పాటు పరిశోధన రంగాల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. విద్య ద్వారానే వ్యక్తి, సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని ఆయన విశ్వసించారని పేర్కొన్నారు. మతసామరస్యం, జాతీయ సమైక్యత, సోదరభావం, సమానత్వం వంటి విలువలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కొడప మారుతి, పట్టణ అధ్యక్షుడు కమలేష్ (బంటి), ఖాజా మైనుద్దీన్, హంసరాజ్, చందాఫాషా, పోర్ల శంకర్, గణేష్, అస్పక్, ప్రభాకర్, గుండయ్య, ధర్మ, శివాజీ, పాషాతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్మశాలి భవన నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

జిల్లా, మండల కేంద్రాల్లోనూ పద్మశాలీల ఆత్మగౌరవ భవనాలకు స్థలాలు, నిధులు కేటాయించాలి

జీవో నంబర్ 14ను రద్దు చేయాలి.. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు

మంచిర్యాల : తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని కోకాపేటలో రాష్ట్ర పద్మశాలి సంఘానికి 2018 సంవత్సరంలో 2.5 ఎకరాల భూమిని కేటాయించగా, తాజాగా పద్మశాలి భవన నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచిర్యాల జిల్లా భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన పద్మశాలి సంఘం సమావేశంలో హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని 29 జిల్లా కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లోనూ పద్మశాలీల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు కేటాయించి, భవన నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సమావేశం ద్వారా కోరారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 14ను వెంటనే ఉపసంహరించుకో వాలని డిమాండ్ చేశారు. బీసీలకు, ముఖ్యంగా పద్మశాలీలకు సంబంధించిన ఆత్మగౌరవ భవనాలపై ప్రభుత్వ పెత్తనం ఉండేలా ఈ జీవో ఉందని పేర్కొంటూ, దానిని రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నియమించే వివిధ కార్పొరేషన్ల చైర్మన్, డైరెక్టర్ పదవుల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 శాతం జనాభా కలిగిన పద్మశాలీలకు తగిన ప్రాధాన్యత



కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. పద్మశాలీలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని, రాజకీయాలకు అతీతంగా సంఘటితమై తమ హక్కులను సాధించుకోవాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా "జై పద్మశాలి.. జై బీసీ.. జై మార్కండేయ.. పద్మశాలీలారా రాజకీయాలకు అతీతంగా ఏకం కండి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక, శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు, బీసీ సంఘాల నాయకుడు గజ్జెల్లి వెంకటయ్యతో పాటు జంజీరాల నారాయణ, అశోక్, వేముల చిప్ప రామస్వామి, ఆడిచర్ల రాజేశం, పరిష శ్రీనివాస్, రాందాస్, బొద్దున బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ లో రిటైర్మెంట్...

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1996 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి, అడిషనల్ డీజీపీ ఎన్. సంజయ్‌కు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. నిధుల దుర్వినియోగం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన సస్పెన్షన్‌ను మరోసారి పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన వయోపరిమితి ప్రకారం పదవీ విరమణ పొందే 2027 మార్చి 31వ తేదీ వరకు లేదా ఆయనపై ఉన్న క్రిమినల్ విచారణ పూర్తయ్యే వరకు ఏది ముందైతే అది సస్పెన్షన్ వేటు కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ అధికారిక జీవో జారీ చేశారు.గత ప్రభుత్వ హయాంలో ఏపీ సీఐడీ అడిషనల్ డీజీపీగా, అలాగే విపత్తు నిర్వహణ-అగ్నిమాపక సేవల శాఖ డీజీగా పనిచేసిన సమయంలో సంజయ్ భారీగా నిధుల మళ్లింపునకు పాల్పడ్డారని అభియోగాలు నమోదు అయ్యాయి. అగ్ని వెబ్ పోర్టల్ నిర్వహణకు కేటాయించిన ప్రభుత్వ నిధులను పక్కదోవ పట్టించడంతో పాటు, సీఐడీ చీఫ్‌గా ఎస్సీ, ఎస్టీ చట్టంపై పోలీసులకు శిక్షణ ఇచ్చేందుకు కేటాయించిన నిధుల్లో రూ. 1.15 కోట్లు దుర్వినియోగం చేశారనే ప్రాథమిక ఆధారాలు లభించాయి. దీంతో ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్-1969 కింద ప్రభుత్వం ఆయనపై 2024 డిసెంబర్ 3న తొలిసారి సస్పెన్షన్ విధించింది.విజయవాడ ఏసీబీ 2024 డిసెంబర్ 24న సంజయ్‌పై అవినీతి నిరోధక చట్టం కింద క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణను వేగవంతం చేసింది. దీనికితోడు సీనియర్ ఐఏఎస్ అధికారి కుమార్ విశ్వజిత్ నేతృత్వంలో ఆయనపై రెగ్యులర్ శాఖాపరమైన విచారణ కూడా కొనసాగుతోంది. కీలక సాక్షుల విచారణ కొనసాగుతుండటం, ఫొరెన్సిక్ ల్యాబ్ నివేదికలు ఇంకా రావాల్సి ఉండటంతో సమీక్షా కమిటీ సమావేశమై సస్పెన్షన్‌ను కొనసాగించాలని సిఫార్సు చేసింది.హోదా రీత్యా సీనియర్ ఐపీఎస్ అధికారి కావడంతో, ఒకవేళ సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకుంటే సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని, ఆధారాలను తారుమారు చేసే అవకాశం ఉందన్న ఏసీబీ డీజీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో విచారణలన్నీ పూర్తికాకుండా సర్వీసులోకి వచ్చే అవకాశం లేకపోవడంతో ఆయన రిటైర్మెంట్ కూడా సస్పెన్షన్ కాలంలోనే ముగియనుంది. ఈ వ్యవహారంలో తదుపరి చట్టపరమైన చర్యలు వేగంగా చేపట్టాలని ప్రభుత్వం డీజీపీని ఆదేశించింది.